మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల కన్నెర్ర

- జీతాల కోసం గంభీరావుపేటలో ధర్నా
- నాలుగు నెలలుగా పెండింగ్‌లో పెట్టడంపై ఆగ్రహం

గంభీరావుపేట, మార్చి 4: పారిశుధ్య కార్మికులు కన్నెర్రజేశారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని రెండు గంటల పాటు ధర్నా చేశారు. జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న పంచాయతీ ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం డ్రైనేజీలు, రోడ్లను శుభ్రం చేస్తూ ఇంటింటి నుంచి చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులను అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, వెంటనే పెండింగ్ జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ, ఎంపీఓ, ఈఓ అక్కడికి చేరుకుని ఈ నెల 10వ తేదీ వరకు జీతాలు అందిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. బీజేపీ, టీడీపీ నేతలు ధర్నాలో కూర్చొని మద్దతు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శ

నందయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

బోయినపల్లి, (వేములవాడ) మార్చి 4 : మండలంలో ఇటీవల మృతి చెందిన, గాయపడిన బాధిత కుటుంబ సభ్యులను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ మంగళవారం పరామర్శించారు. వెంకట్రావుపల్లి మాజీ సర్పంచ్ బూరుగుల నందయ్య కాలుకు చికిత్స చేయగా, ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అలాగే మల్లాపూర్ రేగులపల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీ భూమిరెడ్డి తండ్రి మల్లారెడ్డి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజారాం, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జూ, మాజీ సర్పంచ్‌లు రమేశ్, శంకర్, రాజు, సోషల్ మీడియా కన్వీనర్ కమల్ గౌడ్, కమలాకర్, ఎల్లారెడ్డి, హరీశ్, శ్రీనివాస్ గౌడ్, రాజశేఖర్, మల్లయ్య, రవి, మహేందర్ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

కలెక్టరేట్, మార్చి 4: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో పని చేసే పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. ఈ మేరకు మంగళవారం రాజన్నసిరిసిల్ల జిల్లా ఏఐటీయూసీ భవన్ సుభాష్‌నగర్‌లోని కార్మిక భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేములవాడ దేవస్థాన కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, పని భారం తగ్గించి కార్మికుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

డ్రాఫ్ట్ వేతనాల జీవోలను సవరించాలి

కలెక్టరేట్, మార్చి 4: షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ డ్రాఫ్ట్ వేతనాల జీవోలను సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి నజీర్‌ను సీఐటీయూ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ, సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్, నాయకులు నర్సయ్య, శ్రీనివాస్, రవి, అంజయ్య పాల్గొన్నారు.

అనుమతులు ఇవ్వాలి

ముస్తాబాద్, మార్చి 4 : మండలంలోని మానేర్ వాగు నుంచి రెండు గ్రామాల ట్రాక్టర్లకు అనుమతులు ఇస్తున్నారన్నారు. కానీ, మండలంలోని అన్ని గ్రామాలకు ఇసుక అవసరం ఉంటుందని, కాగా, అన్ని గ్రామాల ట్రాక్టర్లకు అనుమతులివ్వాలని మంగళవారం ట్రాక్టర్ యాజమానులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అంజేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
I, KANKUNTLA NARESH MALLAIAH S/o. KANKUNTLA MALLAIAH (Old Name) H.No. 2-98 Village: Vegurupalle, Mandal Manakondoor,Dist:Karimnagar Telangana. My Name Was Change to KANKUNTLA NARESH S/o. KANKUNTLA MALLAIAH (New Name)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

పొలాలను ఎండబెడుతోంది

- సాగు నీళ్లివ్వకుండా సర్కారు మా నోట్లో మట్టికొడుతోంది
- మండిపడ్డ పలు గ్రామాల రైతులు
- కాల్వ పనులు చేపట్టాలని రెండు రోజులుగా రిలేనిరాహారదీక్ష


ఎండిన వరి పనులతో రిలే నిరాహారదీక్షలో కూర్చున్న రైతులు

ఇల్లంతకుంట రూరల్, మార్చి 4: ''అధికారంలోకి వస్తే రైతులను రాజులను చేస్తాం.. మడి తడారకుండా సాగునీళ్లిస్తామని గప్పాలు కొట్టిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అసలు నీళ్లే ఇవ్వకుండా ఉన్న పొలాలను ఎండబెడుతోంది'' అంటూ పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో పుష్కలంగా సాగునీరిస్తే.. ఈ మాయదారి కాంగ్రెస్ ప్రభుత్వం తమ బతుకులను బజారుకీడ్చుతోందని, కాల్వ పనులు చేయకుండా, సాగునీళ్లివ్వకుండా తమ నోట్లో మట్టికొడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలంలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ నుంచి ఎల్ఎం 6 కెనాల్ పనులు ప్రారంభించాలని పెద్దలింగాపూర్ శివారులో రైతులు చేపట్టిన రిలేనిరాహారదీక్ష రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాల్వ పూర్తి కాకున్నా గతంలో కేసీఆర్ ఒర్రెల ద్వారా చెరువులు నింపి భూగర్భ జలాలు పెరిగే విధంగా చేశారని, ఇప్పుడు తమ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లంతకుంట మండలం దాచారం వద్ద ఎల్ఎం 6 కెనాల్ నిర్మాణం ప్రారంభిస్తే తంగళ్ళపల్లి మండలం తాడూర్ వద్ద మానేరువాగులో కలుస్తుందని, ఈ కెనాల్ మొత్తం 18 కిలోమీటర్లు ఉంటుందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే భూసేకరణ ప్రారంభించి కాల్వ నిర్మాణ పనులను ప్రారంభమయ్యాయని, ఇల్లంతకుంట మండలంలోని దాచారం, పెద్దలింగాపూర్, రామోజీపేట, చిక్కుడువానిపల్లి, తంగళ్ళపల్లి మండలం చిన్నలింగాపూర్, నర్సింహులపల్లి, ఎడ్లోనికుంట, బాలమల్లుపల్లి, అంకుసాపూర్, లక్ష్మీపూర్, తాడూర్, రామన్నపల్లి తదితర గ్రామాల్లోని 9500 ఎకరాల భూములను సాగునీళ్లు అందుతాయని తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కెనాల్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగు నీళ్ళు అందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు

కాల్వ పనులు ప్రారంభించాలి

కేసీఆర్ సర్కారు ఉన్నన్ని రోజులు ఎల్ఎం 6 కెనాల్ పనులు వేగంగా జరిగినయ్. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పనులు సాగడం లేదు. ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన పరిహారం వెంటనే చెల్లించి కాల్వ పనులను ప్రారంభించాలి. రైతులు రిలేనిరాహారదీక్ష చేస్తున్న కూడా ప్రభుత్వం, నీటి పారు దలశాఖ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు కండ్ల ముందే ఎండుతుంటే రైతులు రోదిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాల్వ పనులను ప్రారంభించాలి.

- జితేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్, పెద్దలింగాపూర్

రెండెకరాలు ఎండింది

ఈ యాసంగి సీజన్‌లో నాలు గెకరాల వరి సాగు చేస్తే పొట్ట కొచ్చినంక నీళ్లు లేక రెండెకరాల పొలం ఎండిపో యింది. రంగనాయక సాగర్ నుంచి వచ్చే కాల్వ పని పూర్తి చేస్తే మా భూములకు సాగు నీళ్లు వచ్చేవి. రెండొద్దుల నుంచి రిలేనిరాహారదీక్ష చేస్తు న్నా ఒక్కలు కూడా రావడం లేదు. మా బాధలు పట్టించుకుంటలేరు. రెండెకరాల పొలం ఎండిపోవడం తో లక్ష రూపాయల దాకా నష్టం వచ్చింది. ప్రభుత్వం వెంటనే కాల్వ పనులను ప్రారంభించి మాకు న్యాయం చేయాలి.

-కీర్తి మల్లయ్య, పెద్దలింగాపూర్

రైతుల గోస పట్టని ప్రభుత్వం

రంగనాయక సాగర్ నుంచి వచ్చే కెనాల్ పూర్తి చేస్తేనే మా ఊరి రైతులకు సాగునీళ్లు వస్తయ్. కానీ, మా గోస ఎవరూ పట్టించుకుంటలేరు. కేసీఆర్ సారు ఉన్నన్ని రోజులు ఎల్ఎం 6 కెనాల్ పనులు వేగంగా నడిచినయ్. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పనులు నిలిచిపోయినయ్. కాల్వ పనులు ప్రారంభించాలని రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులకు చెప్పినా వస్తున్నరు.. పోతున్నరు తప్ప ఎవరూ ఏం న్యాయం చేయడం లేదు. ప్రభుత్వం స్పందించి కాల్వ పూర్తి చేస్తేనే మా బతుకులు మారుతయ్.

- ఈర కొంరయ్య, పెద్దలింగాపూర్

మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతకు సన్నహాలు

రిజర్వాయర్‌ను పరిశీలించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

పంప్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కోనరావుపేట, మార్చి 4 : మిడ్ మానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతకు సన్నాహాలు చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజ్-9లో భాగంగా నిర్మించిన మల్కపేట రిజర్వాయర్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించారు. రిజర్వాయర్ గేట్స్, అండర్ టన్నెల్, పంప్‌హౌస్, మోటర్లు, కంట్రోల్ రూం, విద్యుత్ సరఫరా వంటి వ్యవస్థలను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం మల్కపేట రిజర్వాయర్‌లో నీటి నిల్వ ఎంత ఉందని జిల్లా నీటి పారుదల శాఖ అధికారి అమరేందర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈఈ కిశోర్, డీఈఈలు సత్యనారాయణ, శ్రీనివాస్, వినోద్ ఉన్నారు.

కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 4 : అభివృద్ధిలో ఆమోడ దూరంలో ఉన్న జిల్లా ముఖచిత్రాన్ని మార్చి అభివృద్ధిలో ముస్తాబాద్‌ను అనతికాలంలో అగ్రగామిగా నిలిపిన కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎం మనోహర్, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు శీలం స్వామి, బండి ఎల్లం పేర్కొన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుల మాటల తీరుపై మండిపడ్డారు. ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌ను కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి, నాయకులు ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి తీరును వారు తీవ్రంగా ఖండించారు. మరోసారి ఇలా నోటి కొచ్చినట్లు అహంకారంతో మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఏ అంశంపైనా సరిగ్గా అవగాహన లేని మీరు నోటికొచ్చినట్టు మాట్లాడితే చూస్తు ఊరుకుండేది లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు కంచం నర్సింలు, కేటీఆర్ సేన మండలాధ్యక్షుడు వంగూరి దిలీప్, ఎండీ జహంగీర్, కరెడ్ల మల్లారెడ్డి, శ్రీనివాస్, సుంచు రాజు, శ్రీను, అశోక్, సంజీవ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు రిమాండ్‌కు తరలింపు

తెలంగాణ చౌక్, మార్చి 4: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట శివారులో గల విజయ లక్ష్మీ రైస్‌మిల్ వెనకాల పొదల్లో గత నెల 26న గుర్తుతెలియని శవం లభ్యమైన విషయం తెలిసిందే. కాగా, నాలుగురోజుల క్రితం ఫింగర్‌ప్రింట్ ద్వారా మృతుడు పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన దూస రమేశ్‌గా గుర్తించినట్లు, హత్యకు సంబంధించి అరెస్టు వివరాలను మంగళవారం ప్రకటన ద్వారా టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెంది గాజెంగి మధుసూదన్‌కు తన భార్యకు మధ్య చిన్నపాటి గొడవలు ఉన్న నేపథ్యంలో గత నెల 24న ఓ వైన్స్ వద్ద మద్యం తాగుతుండగా, మధుసూదన్ భార్య విషయంలో ఇద్దరూ గొడవపడినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రమేశ్‌పై కక్ష్య పెంచుకున్న మధుసూదన్ రైస్‌మిల్ వెనకాలగల చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అతిగా మద్యం తాగించి అనంతరం బండరాయితో మోది హత్య చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు రమేశ్‌ను హత్య చేసిన గాజెంగి మధుసూదన్‌ను అరెస్టు చేసి, మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని ఒకరి దుర్మరణం

ముస్తాబాద్/ఇల్లంతకుంట రూరల్, మార్చి 4 : టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఇల్లంతకుంట మండలంలోని అనంతారం శివారులో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామానికి చెందిన నక్క శంకరయ్య(52) టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై చిన్నకోడూర్ మండలంలోని మైలారం గ్రామంలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్తుండగా, అనంతారం శివారులో టిప్పర్ ఢీకొట్టడంతో శంకరయ్య అక్కడికక్కడే చింద్రమై మృతి చెందాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతహాన్ని కానిస్టేబుళ్లు శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, హోంగార్డు బాబు చందర్ సాయంతో ఓ వాహనంలో సిరిసిల్ల మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా ఎంపీడీవోల నూతన కార్యవర్గం

వేములవాడ రూరల్, మార్చి 4: జిల్లా ఎంపీడీవోల సంఘం నూతన కార్యవర్గంను వేములవాడ అర్బన్ మండల పరిషత్ కార్యాలంలో జడ్పీసీఈవో వినోద్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే లక్ష్మీనారాయణ (తంగళపల్లి ఎంపీడీవో), ప్రధాన కార్యదర్శిగా ఏ రాజేందర్ (గంభీరావుపేట, ఎంపీడీవో), ట్రెసరీ సత్తయ్య (ఎల్లారెడ్డిపేట, ఎంపీడీవో), ఉపాధ్యక్షుడు శశికల (ఇల్లంతకుంట, ఎంపీడీవో), జాయింట్ సెక్రటరీ జయశీల (బోయినపల్లి, ఎంపీడీవో), పబ్లిక్ సెక్రటరీ శ్రీనివాస్ (వేములవాడ రూరల్, ఎంపీడీవో), ఈజీ మెంబర్ ఎన్ఆర్ మల్హోత్రా (వేములవాడ, ఎంపీడీవో), నటరాజ్ (రుద్రంగి, ఎంపీడీవో)లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

రాజన్న ఆలయం వద్ద కారు బీభత్సం

- నిద్రిస్తున్న భక్తులపైకి ఎక్కిన వాహనం
- ముగ్గురికి తీవ్రగాయాలు • వరంగల్ దవాఖానకు తరలింపు
- డ్రైవర్ మద్యం మత్తులో ఉండడమే కారణం

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వేములవాడ, మార్చి 4 : మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ కారును ఇష్టామొచ్చినట్లు నడిపి నిద్రిస్తున్న భక్తులపైకి ఎక్కించిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఆలయ పరిసరాల్లో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నల్లగుట్ట తండాకు చెందిన కమిలి, అనిత, రవి తమ కుటుంబసభ్యులు 30 మంది కలిసి రాజన్నను దర్శించుకునేందుకు ఆదివారం వేములవాడకు చేరుకున్నారు. దర్శనం అనంతరం సోమవారం రాత్రి శివార్చన వేదిక సమీపంలోని చలవ పందిళ్ల కింద నిద్రపోయారు. రాత్రి 12 గంటల టైంలో మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్ వాహనాన్ని ఇష్టారాజ్యంగా నడిపి నిద్రిస్తున్న భక్తులమీదికి ఎక్కించడంతో అనిత, కమిలికి, రవికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం మేరకు నైట్ పెట్రోలింగ్ డ్యూటీ ఎస్ఐ మారుతి వచ్చి, క్షతగాత్రులను 108లో కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన, మళ్లీ అక్కడి నుంచి వరంగల్ దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

జహంగీర్‌ను సన్మాంచిన బీఆర్ఎస్ నాయకులు

జాహంగీర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ముస్తాబాద్, మార్చి 4 : మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ జాహంగీర్ అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ముస్తాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం నాయకులు శాలువా కప్పి సన్మానించారు. ఇక్కడ జాతీయ బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్, వంగరి దీలిప్, చుంచు రాజు, పుల్లూరి శ్రీనివాస్, కంచం నర్సింలు, వెంకటేశ్, మల్లరెడ్డి, సంజీవ్ ఉన్నారు.

చోరీకి యత్నించిన అనుమానితుడిని చితకబాధిన కాలనీవాసులు

వేములవాడ, మార్చి 4 : వేములవాడ పట్టణంలోని శివనగర్‌లో మంగళవారం అనుమానితుడు ఓ ఇంట్లో చోరీకి యత్నించాడు. మధ్యాహ్నం కావడంతో ఇంటి యజమానులు గేటుకు తాళం వేసి, ఇంట్లో నిద్రిస్తున్నారు. అయితే ఎవరూ లేరనుకొని గోడ దూకి తలుపును దబాయిస్తుండగా ఇంట్లో నిద్రిస్తున్న వారు బయటకు వచ్చి చూడగా, అనుమానితుడు తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో కాలనీవాసుల సాయంతో ఆయనను పట్టుకొని విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా అనుమానితుడి అదుపులోకి తీసుకొని విచారిస్తామని తెలిపారు.

నేరం చేస్తే శిక్ష తప్పదు

తెలంగాణ చౌక్, మార్చి 4: నేరం చేస్తే ప్రతి ఒక్కరికీ శిక్ష తప్పదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. కోర్టు కేసుల్లో నేరస్తులకు శిక్షలు పడేలా చేయడంతో శిక్షల శాతాన్ని పెంచడం వల్ల సమాచంలో మార్పు వస్తుందన్నారు. కేసుల్లో శిక్షలు పడేలా కృషి చేసిన పీపీలను, కోర్టు కానిస్టేబుళ్లను అభినందించి ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకాలు అందజేశారు. గడిచిన రెండు నెలల్లో 22 కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు కోర్టు ద్వారా విధిండచం జరిగిందని పేర్కొన్నారు. ఇక్కడ అదనపు ఎస్పీ చంద్రయ్య, ఎస్ఐలు శ్రవణ్ యాదవ్, రవీంద్రనాయుడు తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేములవాడ, మార్చి 4: వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి రహదారిలోని సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా బుధవారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని సెస్ ఏఈ సిద్ధార్థ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చెక్కపల్లి రహదారి, మల్లారం రహదారి, కోరుట్ల రహదారి, రాజీవ్ నగర్, భగవంత రావు నగర్, శివ సాయి నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

వడదెబ్బ నివారణకు ద్రవ పదార్థాలు తీసుకోవాలి..

కలెక్టరేట్, మార్చి 4: వేసవిలో వడదెబ్బ నివారణకు ప్రజలు ద్రవపదార్థాలు అధికంగా తీసుకోవాలని.. తద్వారా వడదెబ్బ తగులకుండా ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ రజిత సూచించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఆమె జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులతో వాతావరణంలో మార్పు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

తెలంగాణ చౌక్, మార్చి 1: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు నేటి నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో పారదర్శకంగా జరిగేలా జిల్లా యంత్రంగా అన్ని చర్యలు తీసుకున్నట్లు డీఐఈవో వై శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 పరీక్షా కేంద్రాల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5065 మంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

ఎల్లారెడ్డిపేట, మార్చి 4 : బొప్పాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి రజిత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఆరోగ్య పథకాల అమలుపై వైద్య సిబ్బందితో సమీక్ష జరిపారు. మాతాశిశు ఆరోగ్యం, గర్భవతుల నమోదు, పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు వేయించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి సరియా అంజుమ్, వైద్యులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

వేములవాడ టౌన్, మార్చి 3 : తెలంగాణ ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమ కళాకారుల రాష్ట్ర కన్వీనర్ ఎల్ల పోశెట్టి అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని కళాకారుల ప్రధాన కార్యాలయం నుంచి రాజన్నను దర్శించుకొని, అనంతరం కళాకారులు పోస్ట్‌కార్డులతో ర్యాలీగా వెళ్లి పోస్ట్ ఆఫీస్‌లోని పోస్ట్‌బాక్స్‌కు పూల దండ వేసి, బాక్స్‌లో పోస్ట్ కార్డులను వేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ ఎల్ల పోశెట్టి మాట్లాడుతూ, ఈ నెల 9న హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మిలియన్ మార్చ్ లాగా చేస్తున్న ప్రతిజ్ఞ కార్యక్రమంలో రాష్ట్రంలోని కళాకారులు, ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బొడ్డు రాములు, ఆంజనేయులు, దేవయ్య, లక్ష్మీనారాయణ, సంతోష్‌కుమార్, రవి, లచ్చయ్య పాల్గొన్నారు.

విధులకు ఆటకం కలిగించిన వ్యక్తులపై కేసు

ముస్తాబాద్, ఫిబ్రవరి 4: పోలీసుల విధులకు ఆటంకం కల్పించినా, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజలకు ఇబ్బందులు పెట్టినా కేసులు తప్పవని ఎస్ఐ గణేశ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటనలో రహదారిపై ప్రజలకు అంతరాయం కలిగిస్తూ.. పోలీసు విధులకు అటంకపర్చిన 12 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం

గంభీరావుపేట, మార్చి 4: మండల డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షులుగా సుందరగిరి శీలాకుమార్, ప్రధాన కార్యదర్శిగా దోసల మధు, ఉపాధ్యక్షులుగా వెలుముల శ్రీమతి, దోసల శ్రీనివాస్, పరుశురాములు, బాల రాజు, కార్యదర్శులుగా రాజు, సతీష్, లక్ష్మణాచారి, శ్రీకాంత్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్యక్షుడు దొంతుల శ్రీహరి, ఉపాధ్యాయులు దైత శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తున్నాం

వేములవాడ రూరల్, మార్చి 4 : విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తున్నామని ఎస్ఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని